ఈ రోజు జరిగిన కా॥ బి.వి.రాఘవులు, సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు, గారి ప్రెస్‌మీట్ నోట్ ప్రచురణార్థం పంపుతున్నాము – ఆర్.రాఘవేంద్ర, రాష్ట్ర కార్యాలయం తరపున.

తేది : 17 ఏప్రిల్, 2022,

విజయవాడ.

**కేంద్రం చెప్పిన సంస్కరణల భారాలు మోపుతూ**

**బిజెపిని ప్రశ్నించని వైసిపి**

**పరోక్షంగా సమర్థిస్తున్న టిడిపి**

**భారాలపై రాష్ట్ర వ్యాప్తంగా విశాల ఉద్యమం**

**సంస్కరణల అమలులో ఉత్సాహం చూపుతున్న రాష్ట్ర ప్రభుత్వం**

**లౌకికవాదంపై ఎవరితోనైనా కలిసి పనిచేస్తాం**

**వామపక్ష ఐక్యతకు ప్రాధాన్యత**

**కోర్టుసాక్ష్యాల దొంగతనంపై ఉన్నతస్థాయి విచారణ జరపాలి**

**: సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు**

కేంద్రం తీసుకొస్తున్న ప్రజా వ్యతిరేక సంస్కరణలను రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం మరింత ఉత్సాహంగా అమలు చేస్తోందని, ప్రజలపై పడుతున్న భారాలను ప్రశ్నించడం లేదని, ప్రతిపక్ష టిడిపి కూడా సమర్థించే విధంగా వ్యవహరిస్తోందని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు అన్నారు. ఆదివారం విజయవాడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావుతో కలిసి ఆయన మాట్లాడారు. ప్రజలపై వేస్తున్న భారాలకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా విశాల ఉద్యమం నిర్మిస్తామని తెలిపారు. రెండురోజులుగా జరుగుతున్న సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాల్లో దీనిపై చర్చిస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం ఆలోచించి సంస్కరణల పేరుతో ప్రజలపై ఇష్టారాజ్యంగా మోపుతున్న భారాలను వెనక్కు తీసుకోవాలన్నారు. రాష్ట్రాలపై కేంద్రం అనేక భారాలు రుద్దుతోందని, పెట్రోలు, గ్యాస్ ధరల పెరుగులతోపాటు ఇప్పుడు నగదు బదిలీ పథకాన్ని ప్రవేశపెట్టారని, అప్పుకోసం విద్యుత్ ఛార్జీలు పెంచుతున్నారని, ఇటీవల ఆర్‌టిసి బస్‌ఛార్జీలనూ పెంచారని, చెత్తపన్ను వేస్తున్నారని విమర్శించారు. ప్రజలపై పడుతున్న భారాలను అడ్డుకునేందుకు కేంద్రాన్ని ప్రశ్నించాల్సిన వైసిపి ప్రభుత్వం ఆ పనిచేయకుండా కేంద్రం ఆదేశించిన భారాలను అత్యుత్సాహంగా అమలు జరుపుతోందని తెలిపారు. బిజెపి అనుసరిస్తున్న మతోన్మాద విధానాలకు పరోక్షంగా తోడ్పడుతోందని తెలిపారు. టిడిపి కూడా సంఘ పరివార్ శక్తులను అడ్డుకోకపోగా మౌనంగా వ్యవహరిస్తూ పరోక్షంగా బలపరుస్తోందని విమర్శించారు. వైసిపి, టిడిపి లౌకికపార్టీలో కాదో తేల్చుకోవాలన్నారు. ప్రభుత్వ రంగ ఆస్తులను అమ్మేస్తున్నారని, విద్యుత్ ప్లాంట్లను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్నారని, ఇటువంటి సమయంలో అడ్డుకోవాల్సిన రాష్ట్రం ఆ పనిచేయడం లేదని తెలిపారు. ఈ ప్రభుత్వం ప్రజలకు అనుకూలమో వ్యతిరేకమో తేల్చిచెప్పాలన్నారు. మోడీ విధానాలతో బిజెపి పాలన ప్రజల నుండి వేరుపడిందని తెలిపారు. కప్పిపుచ్చుకునేందుకు మత ఘర్షణలు సృష్టిస్తోందన్నారు. ప్రశాంతంగా జరుపుకునే శ్రీరామనవమి, హనుమాన్‌జయంతి రోజు ఆయుధాలు ఇచ్చి సంఘ్‌పరివార్ శక్తులు ఘర్షణలకు పురిగొల్పుతున్నారని విమర్శించారు. దీన్ని ప్రశ్నించాల్సిన కాంగ్రెస్ కూడా మెతకవైఖరి అనుసరిస్తోందని అన్నారు.

**పోలవరం, ప్రాజెక్టు పునరావాసులకు అన్యాయం**

రాష్ట్రంలో పోలవరం ప్రాజెక్టు పనులను కేంద్రం రెండు ముక్కలు చేసిందని, పునరావాసం, పునర్నిర్మాణం పనులకు కొర్రీ పెట్టిందని తెలిపారు. ఇప్పటి వరకూ గుర్తించిన పునరావాసుల్లో నాలుగోవంతు ప్రజలకు మాత్రమే తాము పునరావాసం కల్పిస్తామని కేంద్రం ప్రకటించిందని అన్నారు. రాష్ట్రం అనుమతి లేకుండా కేంద్రం ఈ తరహా ప్రకటనలు చేస్తుందని సిపిఎంగా తాము అనుకోవడం లేదన్నారు. నగదు బదిలీ పథకాన్ని గతంలోనే చంద్రబాబు ముందుకు తెచ్చారని, ఇప్పుడు అమల్లోకి వచ్చిందని తెలిపారు. ప్రజల వద్ద బియ్యం బదులు నగదు తీసుకుంటామని వలంటీర్లు లేఖలు తీసుకోవడం సరికాదన్నారు.

ప్రజలు నగదు బదులు బియ్యమే తీసుకోవాలన్నారు. అనేక సంక్షేమ పథకాలను ముందు ఇలాగే ప్రవేశపెట్టి అనంతరం ఎత్తేశారని రాఘవులు అన్నారు. రాష్ట్రంలో వార్డు, గ్రామ సెక్రటేరియట్ల వ్యవస్థను ఆమోదిస్తున్నామని అదే సమయంలో అవి స్థానిక సంస్థల పర్యవేక్షణలోనే పనిచేయాలని తెలిపారు. స్థానిక సంస్థలైన పంచాయతీలు, కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు లోబడి పనిచేసేలా చూడాలన్నారు.

**సుమోటోగా విచారించాలి**

నెల్లూరులో ప్రజాప్రతినిధులకు సంబంధించిన కేసులో సాక్ష్యాధారాలను దొంగిలించడంపై హైకోర్టులో సుమోటోగా స్వీకరించి విచారణ జరిపి బాధ్యులు, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. విచారణ జరుపుతున్న కోర్టులకే భద్రత లేకపోతే న్యాయం ఎవరిని అడగాలని ప్రశ్నించారు. చిన్నపాటి దొంగతనాలు జరిగితే సిసి టివి కెమెరాల్లో చూసి నిందితులను గుర్తించామని చెప్పే పోలీసులు ఈ కేసులో ఎందుకు నిందితులను పట్టుకోలేకపోయారో చెప్పాలని అన్నారు. ప్రజాప్రతినిధుల కేసుకు సంబంధించిన సాక్ష్యాధారాలే పోతే ఇక కోర్టుకు భద్రత ఎక్కడని ప్రశ్నించారు. దీనిపై విచారించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. హైకోర్టు స్వీయ పర్యవేక్షణలో ఉన్నతస్థాయి విచారణ జరగాలని అన్నారు. సాక్ష్యాలు మాయం చేయడం వల్ల అసలు నిందితులు స్వేచ్ఛగా బయటకు తిరుగుతారని తెలిపారు. దీనివెనుక ప్రభుత్వ పెద్దల భాగస్వామ్యం ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో వీలైనంత త్వరగా విచారణ పూర్తి చేయాలన్నారు.

**వామపక్ష ఐక్యతకు ప్రాధాన్యత**

దేశంలో వామపక్ష ఐక్యతకు సిపిఎం ప్రాధాన్యత ఇస్తోందని, ఇటీవల కేరళలో జరిగిన జాతీయ మహాసభల్లో ఇదే అంశంపై చర్చించామని తెలిపారు. ముందుకు వచ్చే అన్ని శక్తులతో కలిసి ఉద్యమాన్ని ముందుకు తీసుకెళతామని అన్నారు.

**లౌకికవాద పరిరక్షణకు ఎవరితోనైనా కలిసి పనిచేస్తాం**

దేశంలో బిజెపి విధానాల వల్ల లౌకికవాదం దెబ్బతింటోందని, దీన్ని వ్యతిరేకించే ఏ పార్టీతో అయినా కలిసి పనిచేసేందుకు సిపిఎం సిద్ధంగా ఉందని బి.వి.రాఘవులు తెలిపారు. ఈ విషయంలో రాష్ట్రంలో ఉన్న అన్ని పార్టీల నాయకులు స్పందించాలన్నారు. లౌకికవాదం విషయంలో వైసిపి, టిడిపిలతో కలిసి పనిచేసేందుకు తమకు ఎటువంటి అభ్యంతరమూ లేదని పేర్కొన్నారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా విశాల ఉద్యమం, ఎన్నికల పొత్తులు వేరు వేరు అంశాలని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. మరోవైపు ఇటీవల జరిగిన ఉప ఎన్నికల్లో అన్నిచోట్ల బిజెపి ఓడిపోయిందని, గతంలో ఐదు రాష్ట్రాల ఎన్నికల్లోనూ అస్తుబిస్తుగా గెలిచిందని అన్నారు.

= = =